మోదీ నాయకత్వంలోనే ప్రజలు ప్రశాంతం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


రోడ్ షోలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో శాంతిభద్రతలు పెరిగాయని, కర్ఫ్యూలు, మత కలహాలు, ఎటువంటి గొడవలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం సనత్ నగర్, అమీర్‌పేట డివిజన్‌లలో కిషన్‌రెడ్డి రోడ్ షో నిర్వహించారు. సనత్‌నగర్‌లోని నెహ్రూనగర్ కూడలి, అమీర్‌పేట సత్యం చౌరస్తాలో ఏర్పాటుచేసిన బహిరంగ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది, ప్రపంచంలో మరింత గౌరవం పెరగాలంటే మరోసారి నరేంద్రమోదీ ప్రధానిగా ఎన్నిక కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ భవిష్యత్తు, పేదల సంక్షేమం కోసం ప్రజలు బీజేపీకి ఓటేయాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో దేశంలో అరాచకం పెరిగి, ఘర్షణలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిన విషయం అందరికీ తెలుసునన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, కార్పొరేటర్ కేతినేని సరళ, సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్, దయానంద్, మూల రవీందర్, శ్రీశైలంగౌడ్, ఆకుల మహేష్, కస్నూరి క్రాంతికుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తలసానికి పలువురి రంజాన్ శుభాకాంక్షలు


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన బేగంపేట డివిజన్ నేతలు..

సనత్‌నగర్: నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసి పవిత్రంగా, సంతోషంగా జరుపుకునే పండుగ రంజాన్ అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని బేగంపేట, బన్సీలాల్‌పేట డివిజన్లకు చెందిన పలువురు ముస్లింలు శుక్రవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బన్సీలాల్‌పేటకు చెందిన అబ్బాస్, రజాక్, జహంగీర్, బేగంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, ఆరీఫ్, సాబేర్, వాహెద్, కిషోర్, లక్ష్మీపతి, లంక రాజు, నాగభూషణం, కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు నియామక పత్రాలు అందజేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పోలీసు ఉద్యోగాలకు ఎంపికై ఎంక్వైరీలో కేసులు ఉన్నాయని తేలడంతో 250 మంది అభ్యర్థులు నియామకాలు నిలిచిపోయాయని పలువురు అభ్యర్థులు శుక్రవారం రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. గ్రామాల్లో చిన్నా చితక గొడవలకు, ఇతర కేసులలో నిర్దోషులుగా కోర్టులు తీర్పు ఇచ్చినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటినుంచి కూడ వివిధ శాఖల మంత్రులతో పాటు టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్‌ను సైతం కలసి సమస్యను చెప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామకాలను నిలిచిపోయాయి అని వెంటనే నియామకపు ఉత్తర్వులను జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు.

గురుద్వారలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభం


కార్యక్రమానికి హాజరైన మహిళలు

అమీర్‌పేట: అమీర్‌పేట గురుద్వారలో వైశాఖీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం అమృత్ సంచార్ కార్యక్రమం నిర్వహించారు. సిక్కు మత గురువులు (రాగి జత్థాస్) గుర్బానీ కీర్తనలను ఆలపిస్తూ, గురు గ్రంధాన్ని పఠిస్తూ అమృత్ పాన్ (పవిత్ర పానియం)ను తయారు చేసి అందజేశారు. పలువురు యువతీ, యువకులు,మహిళలు,పిల్లలు హోలీ బాప్టిజాన్ని స్వీకరించారు. ప్రబంధక్ కమిటీ గురుద్వారా సాహెబ్ అధ్యక్ష కార్యదర్శులు సర్దార్ దర్శన్‌సింగ్, సురెందర్‌సింగ్, ఉపాధ్యక్షులు కుశ్వంత్‌సింగ్,లాహోర్‌సింగ్,అజిత్‌సింగ్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత


చీరలను పంపిణీ చేస్తున్న సుజాత

కాచిగూడ: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ రాణించాలని తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. విబిజి ఫౌండేషన్ వనితా విభాగ్ ఫౌండర్ మడిపడిగె సత్యవతి ప్రసన్న జన్మదినం సందర్భంగా శుక్రవారం మహిళలకు చీరలు, కుట్టు మిషన్‌ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనాథ ఆశ్రమాల్లో నిత్యావసర వస్తువులు, వృద్ధాశ్రమాల్లో దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... మహిళలు ఏదో ఒక రంగంలో నైపుణ్యం పెంపొందించుకుని ఆర్థిక పురోగతిని సాధించాలన్నారు. మహిళలు ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం బాగుటుందని అన్నారు. ప్రతి మహిళ విద్యను అభ్యసించాలని సూచించారు. సత్యవతి ప్రసన్నను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సేవా కార్యక్రమాల్లో ముందుకు రావాలని కోరారు. శత చిత్రాల నిర్మాత తుమ్మల పల్లి రామసత్యనారాయణ, ప్రొడ్యూసర్ డి.ఎస్.రావు, విబిజి ఫౌండేషన్ ఫౌండర్ మడిపడిగ రాజు, మీరా విజయలక్ష్మీ, సంతోష్, విశ్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం


రాజేష్ కుటుంబ సభ్యులకు రూ. లక్ష సాయాన్ని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

హిమాయత్‌నగర్: వృత్తిలో సవాళ్లు, విపరీతమైన పని ఒత్తిడి, సమయ పరిమితులతో జర్నలిస్టుల జీవితాలు ఆందోళనకరంగా మారాయని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యువ ఫొటో జర్నలిస్టు నర్రె రాజేష్ 41 సంవత్సరాల చిన్న వయస్సులో మన మధ్య నుంచి అతని ఆకస్మిక మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఇటీవలే గుండెపోటుతో మరణించిన యువ ఫొటోజర్నలిస్టు నర్రె రాజేష్ సంస్మరణ సభ నిర్వహించింది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్ అధ్యక్షత వహించగా కె.శ్రీనివాస్‌రెడ్డితోపాటు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ప్రధాన కార్యదర్శి శిగా శంకర్ గౌడ్, నర్రె రాజేష్ సతీమణి లావణ్య, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తరపున నర్రె రాజేష్ కుటుంబానికి రూ. లక్ష నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఫొటో, వీడియో జర్నలిస్టులు ఆందోళనలు, హింసాత్మక సంఘటనలు చిత్రించే సమయంలో మరణించడం, గాయాలవడం తోపాటు పని ఒత్తిడితో ఫొటో జర్నలిస్టుల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నర్రె రాజేష్ భార్యకు పెన్షన్‌తోపాటు అయన పిల్లలకు విద్యను అందించడానికి మీడియా అకాడమీ సహాయం అందజేస్తుందని శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఎస్.హరి, జేఎస్‌జేహెచ్ఎస్ అధ్యక్షుడు బొమ్మగాని కిరణ్‌కుమార్, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆకలి తీరుస్తూ..ఆదర్శంగా నిలుస్తూ..

జూన్ 2 వరకు నిరంతరాయంగా.. ● బాటసారుల ఆకలి తీరుస్తున్న శ్రీనివాస రామానుజ చారిటబుల్ ట్రస్ట్..


మధ్యాహ్న మిత భోజనం కేంద్రం వద్ద సేవలు అందిస్తున్న ట్రస్టీ పార్థసారథితో పాటు వయోవృద్ధులు

సనతనగర్: వేసవి వచ్చేసింది. మండుటెండలను 'ఢీ'కొట్టేలా మధ్యాహ్న మిత భోజనమూ వచ్చేసింది. ఒకటి కాదు..రెండు కాదు..గత 13 ఏళ్లుగా అన్నార్తుల, అభాగ్యుల ఆకలి తీరుస్తోన్న శ్రీనివాస సమాజ సేవా సమితి మరోసారి తన మధ్యాహ్న మిత భోజన సేవలను ప్రారంభించింది. ఈ మహా క్రతువులో మండుటెండలను సైతం లెక్కచేయకుండా వయోధిక పౌరులు తమ సేవలను కొనసాగిస్తున్నారు. జూన్ 2వ తేదీ వరకు బీకేగూడ పార్కు వద్ద రోజుకు 250–300 మందికి మధ్యాహ్న మిత భోజనాన్ని వడ్డించి ఆకలి తీర్చనున్నారు.

దాతల సహకారంతో..

వేసవికాలంలో శ్రీనివాస సమాజ సేవా సమితి తరపున చేపట్టే అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు దాతలు పోటీపడుతుంటారు. ఒక్కోరోజు ఇద్దరు ముగ్గురు సైతం ముందుకువచ్చి విందు భోజనాన్ని తలపించే రీతిలో రుచికరమైన వంటకాలను బాటసారులకు అందిస్తుంటారు. అయితే ఈ సారి రోజుకో దాత అనే నినాదంతో ట్రస్ట్ ముందుకువచ్చింది. ఫలానా రోజు పుట్టిన రోజు, పెళ్లి రోజు వంటి శుభకార్యాలను పురస్కరించుకుని వారి పేరు మీద నలుగురికి అన్నదానం చేసే వెలుసులుబాటును గత 13 ఏళ్లుగా సేవా సమితి కల్పిస్తోంది. దీంతో పాటు అయినవారి జ్ఞాపకార్థం వారి ఆత్మకు శాంతి చేకూరేలా మరికొంతమంది ఇక్కడ అన్నదానానికి ముందుకువస్తుంటారు. ఇలా ఏదో ఒక రూపంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి మితభోజన యజ్ఞంలో పాలుపంచుకుంటుంటారు. ఇప్పటికే జూన్ 2 వరకు అన్ని రోజులకు సరిపడా దాతలు అన్నదానం కోసం బుక్ చేసుకున్నారు.


మధ్యాహ్న మిత భోజన కేంద్రం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం..

రూ.5,000..రుచికరమైన వంటకాలు..

కేవలం ఒక్కో దాత నుంచి రూ.5,000 మాత్రమే స్వీకరించి రుచికరమైన వంటకాలను బాటసారులకు అందిస్తున్నారు. 10 కిలోల పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, బగారా రైస్, కరి, స్వీట్స్‌తో పాటు ప్లేట్లు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను కలుపుకుని 5,000 రూపాయలుగా నిర్ణయించారు. మధ్యాహ్న భోజన వితరణ కేంద్రం వద్ద అందరూ సీనియర్ సిటిజన్స్ సేవలు అందిస్తుండడం గమనార్హం.

దాతలు, వయోధిక పౌరుల సహకారం అపూర్వం

గత 13 ఏళ్లుగా బీకేగూడ పార్కు వద్ద మధ్యాహ్న మిత భోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి దాతల సహకారం అపూర్వమైనన్నారు. అదేవిధంగా ప్రతియేటా మితభోజన కేంద్ర నిర్వహణలో వయోధిక పౌరుల సహకారం మరువలేనిదన్నారు. అలాగే ప్రతి ఏడాది లాగానే చలివేంద్రం ఏర్పాటుకు ముందుకువచ్చిన శ్యాంసుందర్‌రాజ్‌కు కృతజ్ఞతలు. – ట్రస్టీ పార్థసారధి

నేడు లాలాపేటలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశం

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శనివారం లాలాపేటలోని నఫీజ్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ తార్నాక, లాలాపేట బూత్ స్థాయి సమావేశం ఏర్పాటు చేసినట్లు టీపీసీసీ కార్యదర్శి జిడి అమర్‌నాద్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే బూత్ స్థాయి సమావేశానికి ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార యాదవ్, మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల ఇంచార్జులు తదితరులు హాజరైతున్నట్లు పేర్కొన్నారు.

తలసానిని కలిసిన గురుద్వార ప్రతినిధులు


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానిస్తున్న గురుద్వార ప్రతినిధులు

సనత్‌నగర్: అమీర్‌పేటలో నిర్వహించే బైసాకీ ఉత్సవాలకు హాజరుకావాలని గురుద్వార ప్రతినిధులు శుక్రవారం సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసంలో కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. గురుద్వార్ అధ్యక్షులు దర్శన్‌సింగ్, సెక్రటరీ సురేందర్‌సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్‌లతో పాటు ఇతర కమిటీ సభ్యులు ఉన్నారు.

బూత్ స్థాయి నుంచి పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాము వర్మ

లాలాపేట: తార్నాక డివిజన్ బీజేపీ బూత్ స్థాయి సమావేశంలో శుక్రవారం లాలాపేటలోని కార్తీక్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో డివిజన్ అధ్యక్షులు రాము వర్మ అధ్యక్షతన జరిగింది. దీనికి బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ ప్రభారి రాజ్ భోపాల్‌గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని మాట్లాడారు. బూత్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో నేతలు వెంకటేష్‌గౌడ్, పోచయ్య యాదవ్, వేణు, ప్రకాష్, వీరన్న, గణేష్ ముదిరాజ్, అనిత, ఆకుల శ్రీనివాస్ తదితరులున్నారు.

రేపు యోగ్ సంస్థాన్ వ్యవస్థాపక దినోత్సవం

సాక్షి,సిటీబ్యూరో: భారతీయ యోగ్ సంస్థాన్ 58వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం 6 గంటలకు సికింద్రాబాద్ జూబ్లీబస్‌స్టేషన్ సమీపంలోని పికెట్ పార్కులో యోగా కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ వెస్ట్ జోన్‌కు సంబంధించిన శాఖల నుంచి యోగా సాధకులు విచ్చేసి యోగాసనాల ప్రదర్శన నిర్వహిస్తారని హైదరాబాద్ వెస్ట్ జోన్ భారతీయ యోగ్ సంస్థాన్ అధ్యక్షుడు ఆర్.ఆర్.యదు కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే యోగా సాధనలో స్త్రీ, పురుషులందరూ పాల్గొనవచ్చని, శిక్షణ ఉచితమని ఆయన పేర్కొన్నారు.

కల్తీ పాలను అరికట్టాలంటూ ధర్నా


ధర్నా చేస్తున్న వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు

లాలాపేట: కల్తీ పాల సరఫరాను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తార్నాక వెల్‌ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా. పి. మోహన్‌రావు అన్నారు. తార్నాక ప్రాంతంలో రైతన్న పాల కేంద్రం ఎదుట శుక్రవారం వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. రైతన్న పాలు పేరుతో విక్రయిస్తున్న పాలను, పాల పదర్థాలు కల్తీ అని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ నిర్ధారించిందన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి, నవీన్ , వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధి మోదీ సర్కార్ ఘనతే

కాచిగూడ: ప్రపంచంలో అగ్ర దేశాలతో పోటీ పడుతున్న భారత దేశం.. మున్ముందూ ఇలాగే దూసుకెళ్లాలంటే మోదీ ప్రభుత్వం రావాలని బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం బర్కత్‌పురాలోని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెట్ కార్యాలయంలో గోల్నాక డివిజన్ పోలింగ్ బూత్ కో ఆర్డినేటర్లు, బూత్ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శుల సమావేశం రవీందర్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధితో పాటు ప్రజల అభ్యున్నతి, సంక్షేమానికి మోదీ ప్రభుత్వం ఆహర్నిశలు పాటుపడిందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నుంచి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే విధంగా పార్టీ నేతలు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. అంబర్‌పేట ప్రభావరి అంజన్ కుమార్ గౌడ్, ఎం.శ్యామ్‌రాజ్, కేసరి నర్సింగ్‌యాదవ్, ఆర్.వి.ఎల్.రమేష్, కె.రవీందర్, ఆర్.కె.రాంచందర్, ఎం.కృష్ణంరాజు, కె.శ్రీనివాస్ రెడ్డి, వై.దామోదర్, బి.రంజిత్‌రెడ్డి, స్వప్నప్రియ, సావిత్రి, సురేష్, అనిల్, రమేష్, వంశీకృష్ణ, వేణుగోపాల్, కృష్ణ, ఈశ్వర్‌రావు, జంగయ్య, కేశవ పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలి

చిక్కడపల్లి: కలుషిత నీటి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆదేశించారు. చిక్కడపల్లి 1, 2 వీధులతో పాటు బాపునగర్ పరిసర ప్రాంతాలలో ఇటీవల తాగునీటి పైపుల్లో రంగుమారిన, దుర్వాసనతో కూడిన కలుషిత నీటి సరఫరా జరుగుతుందని స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆయా ప్రాంతాలలో కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవి దృష్ట్యా తాగునీటి ఇక్కట్లను ఆరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లో ప్రెషర్, కలుషిత నీటి సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.

భారీగా తాగునీరు వృథా

సెలయేటిని తలపించిన గోల్నాక మార్కెట్ రోడ్డు



గోల్నాక మార్కెట్ రోడ్డులో పైపులోంచి వస్తున్న నీరు

నల్లకుంట: నల్లకుంట డివిజన్ గోల్నాక కూరగాయ మార్కెట్ రోడ్డులోని కమాన్ వద్ద శుక్రవారం ఉదయం సీవరేజీ పైపుల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. పైపుల్లోంచి నీరు పైకి ఎగిసి వచ్చింది. వేలాది లీటర్ల తాగు నీరు మార్కెట్ రోడ్డును ముంచెత్తింది. దాదాపు రెండు గంటలకు పైగా తాగు నీరు రోడ్డుపై పొంగిపొర్లినా జలమండలి అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సెలయేరులా పొంగిపొర్లుతున్న ఆ నీటిలో స్థానికంగా ఉన్న చిన్నారులు కేరింతలు కొడుతూ జలకాలాడుతూ ఆడుకోవడం కనిపించింది. చాలా సేపటి తరువాత అక్కడికి చేరుకున్న జలమండలి సిబ్బంది నీటి సరఫరా నిలిపివేశారు. అప్పటికే ఎంతో అమూల్యమైన వేలాది లీటర్ల తాగు నీరు వీధిపాలై పోయిందని స్థానికులు వాపోయారు. ఆ తర్వాత జలమండలి అధికారులు నిధానంగా పైపుల్లో ఏర్పడిన లీకేజీకి మరమ్మతులు ప్రారంభించారని తెలిపారు. తరుచూ ఈ ప్రాంతంలో పైపుల్లో లీకేజీలు ఏర్పడుతుందని, ఈ సమస్య పునరావృతం కాకుండా శాస్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: (కిలో.. రూపాయల్లో)... టమాటా రూ.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 32, దొండ 18, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 17, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 32, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు.

రేపు బ్లూ మార్చ్

ఉస్మానియా యూనివర్సిటీ: భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం (14న) నీలి చొక్కాలను ధరించి బ్లూ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామగళ్ళ సురేందర్ బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరవెల్లి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బ్లూ మార్చ్ విజయవంతం కోసం రూపొందించిన కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు.సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో తక్షణ ఉపాధి


పరిశ్రమ పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న డాక్టర్ ఎస్.వి.రావు

ఉస్మానియా యూనివర్సిటీ: స్కిల్ యూనివర్సిటీల స్థాపనతో విద్యార్థులకు తక్షణం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అక్వాఫిన ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్, ఓయూ పూర్వవిద్యార్థి డాక్టర్ ఎస్‌వీ రావు పేర్కొన్నారు. శుక్రవారం ఖైరాతబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీబీఏ విద్యార్థులు ఫీల్డు విజిట్‌లో భాగంగా ఘట్‌కేశ్వర్ మండలం, కొర్రెముల గ్రామంలోని అక్వాఫిన ఇండస్ట్రీని సందర్శించారు. విద్యార్థులకు ఇండస్ట్రీ స్థాపన, నిర్వహణ, పెట్టుబడి, వస్తువు ఉత్పత్తి తయారీ, డిమాండ్, సప్లయ్, కార్మికుల పని తీరు తదితర అంశాలను వివరించారు. విద్యార్థులతో పాటు కాలేజీ బీబీఏ హెడ్ డాక్టర్ అంబాటి రమణ, అధ్యాపకులు శైలజ, కంప్యూటర్ సైన్స్ హెడ్ డా.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కంటోన్మెంట్ కో-ఆర్డినేషన్ కమిటీ నియామకం

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా నియోజక వర్గం లోని ముఖ్య నాయకులకు ఎన్నికల బాధ్యతలను పార్టీ అప్పగించారు. నియోజకవర్గ ఎన్నికల ప్రచార బాధ్యతలను కంటోన్మెంట్ ఇంచార్జీ డాక్టర్ జీవి. వెన్నెలగద్దర్, నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జీ, బూత్ కమిటీల ఏర్పాటు, పర్యవేక్షణ సీనియర్ నాయకులు మర్రి అమరేందర్ రెడ్డికి, మైనార్టీస్ అఫైర్స్ బాధ్యతలను టీపీసీసీ సెక్రటరి అయూబ్‌ఖాన్, మరో సీనియర్ నాయకులు ఎంఏ.జమీల్, కాలనీల బాధ్యతలను ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డికి అప్పగించారు.

బీజేపీ టికెట్ కేటాయించాలి

రసూల్‌పురా: కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బీజేపీ పార్టీ అభ్యర్థిగా అల్వాల్ మున్సిపల్ మాజీ చైర్మన్ జీవకన్‌కు టికెట్ కేటాయించాలని దళిత సంఘం కంటోన్మెంట్ సీనియర్ నాయకులు జేరిపోతుల సాయన్న మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం బాలంరాయి అంబేద్కర్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడుతూ జీవకన్ సీనియర్ నాయకులని ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం కంటోన్మెంట్ నియోజకవర్గంలోనే జీవకన్‌కు స్వంతగా 25 వేల ఓటు బ్యాంకు ఉందని చెప్పారు. కంటోన్మెంట్‌లోని మాదిగలంతా కలిసికట్టుగా జీవకన్ గెలుపుకోసం కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్, నాగరాజు, శ్రీను, రామ్‌లక్ష్మన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. చర్లపల్లి – ఘట్కేసర్ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో చర్లపల్లికి చెందిన నర్సింహ(80) అనే వృద్ధుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుకవైపు నుంచి వచ్చిన రైలు ప్రమాదవశాత్తు వృద్ధుడ్ని ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గంటలోపే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం


సాయిదీప్తి

చిలకలగూడ: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది.ఎస్ఐ సవిత తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి వీరయ్యగల్లీ ప్రాంతానికి చెందిన ఎన్‌వీ సాయి దీప్తి (18) పద్మారావునగర్‌లోని సాయి విజ్ఞానభారతి కాలేజీలో డిగ్రీ చదువుతోంది. ఈనెల 10న కాలేజీకి అని చెప్పి బయటకు వెళ్లిన తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. సన్నిహితులు, బంధుమిత్రులతోపాటు కళాశాలలో వాకబు చేసిన ఫలితం లేకపోవడంతో తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూలిన చెట్టు కొమ్మ.. తప్పిన పెను ప్రమాదం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులోని కిషన్ రావు ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఓ భారీ వృక్షం కొమ్మ శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా కూలిపోయింది. అది కాస్తా రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో ఎంతో రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలతో తీవ్ర అంతరాయం కల్గింది. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం హుటాహుటిన అక్కడికి చేరుకుని కూలిపడిన చెట్టు కొమ్మలను యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ అమృత అక్కడికి చేరుకుని తొలగింపు పనులను పర్యవేక్షించారు.

